- 14వ తేదీలోగా ఆన్‌లైన్‌లో విద్యాసంస్థల సమగ్ర సమాచారం
- జాతీయ స్థాయిలో ఒకే ఫార్మాట్ రూపకల్పన
- ఈ విధానం ఆధారంగా నిధుల కేటాయింపు

# విద్యాభివృద్ధికి యూ డైస్

మెదక్ మున్సిపాలిటీ, డిసెంబర్ 10: దేశంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల సమస్త సమాచారాన్ని తెలుసుకునేందుకు విద్యాశాఖ యూ-డైస్ విధానానికి శ్రీకారం చుట్టింది. జాతీయ స్థాయిలో ఒకే విధానం ఉండేలా యూనిఫైడ్ డిస్ట్రిక్ట్ ఇన్‌ఫర్మేషన్ సిస్టం ఫర్ ఎడ్యుకేషన్ (యూ-డైస్) ఫార్మాట్‌ను రూపొందించింది. పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయుల సంఖ్య, విద్యాసంస్థల స్థితిగతులు, మౌలిక వసతులు, ప్రత్యేక అవసరాలు గల పిల్లల వివరాలను సంబంధిత ఫార్మాట్ల ద్వారా ఆన్‌లైన్‌లో పొందుపరుస్తారు. ఈ పద్ధతి ద్వారా సాధారణ పౌరుడు సైతం కంప్యూటర్‌లో డైస్ కోడ్‌తో పూర్తి సమాచారం తెలుసుకోవచ్చు. ఈ నెల 14 వరకు ఆమోదం పొందిన అన్ని విద్యాసంస్థల సమాచారాన్ని నిక్షిప్తం చేస్తున్నారు. దీని ఆధారంగానే పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు 2023-24 విద్యా సంవత్సరానికి పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్స్, పాఠశాలల నిర్వహణ, మధ్యాహ్న భోజనం తదితర సౌకర్యాలతో పాటు అభివృద్ధికి సంబంధించిన నిధులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్లలో కేటాయిస్తాయి.

### మెదక్ జిల్లాలో విద్యాసంస్థలు

మెదక్ జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు 899, కేజీబీవీలు 15, మోడల్ స్కూళ్లు 7, గురుకుల పాఠశాలలు 23, ప్రైవేట్ పాఠశాలలు 109, జూనియర్ కళాశాలలు 65 ఉన్నాయి. వీటిలో సుమారు 1.20 లక్షల మంది విద్యనభ్యసిస్తున్నారు. సంబంధిత సమాచారాన్ని మూడంచెలుగా పరిశీలించి జిల్లా స్థాయికి పంపించి అక్కడ ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. పాఠశాలలు, కళాశాలలకు సంబంధించిన కచ్చితమైన సమగ్ర సమాచారాన్ని పొందుపర్చాలి. పాఠశాలలు, కళాశాలల్లో టీచర్లు, అధ్యాపకులు, విద్యార్థులు, మౌలిక వసతులు, తరగతి గదులు, ఫర్నిచర్ తదితర వివరాలు. ప్రత్యేక అవసరాలు గల విద్యార్థుల వివరాలు, కమ్యూనిటీ విద్యార్థుల సంఖ్య ప్రగతి వివరాలు. పాఠశాలల్లో విద్యార్థుల కోసం అమలుచేస్తున్న నైపుణ్య కార్యక్రమాలను నమోదు చేస్తారు.

### మూడంచెల పరిశీలన ఇలా..

డైస్ ఫార్మాట్లను మూడంచెలుగా పరిశీలించాల్సి ఉంటుంది. పాఠశాలలు, కళాశాలల సమగ్ర సమాచారాన్ని హెచ్‌ఎంలు, ప్రిన్సిపాళ్లు ఫార్మాట్లలో పొందుపరిచిన సమాచారాన్ని మూడంచెలుగా పరిశీలిస్తారు. ఫార్మాట్ల సమాచారాన్ని ప్రధానోపాధ్యాయులు పూరించిన తర్వాత సంబంధిత కాంప్లెక్స్ హెచ్‌ఎంలకు అందజేస్తారు. ఆయన పరిశీలించిన అనంతరం ఎమ్మార్సీ కార్యాలయంలో ఇస్తారు. మండల విద్యాధికారి క్షుణ్ణంగా పరిశీలించి డీఈవో కార్యాలయానికి పంపిస్తారు. కళాశాలల ప్రిన్సిపాళ్లు మాత్రం తాము పూరించిన డైస్ ఫార్మాట్లను జిల్లా ఇంటర్ విద్యాశాఖ అధికారికి అందజేస్తారు. జిల్లా విద్యాధికారి, మండల విద్యాధికారులు పాఠశాలలను క్షేత్రస్థాయిలో పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిక ఆందజేస్తారు. జిల్లా స్థాయిలో యూ-డైస్‌పై ఎంఈవో, కాంప్లెక్స్ హెచ్‌ఎంలు, మండలానికో సీనియర్ ఉపాధ్యాయున్ని కేటాయించి ఇదివరకే శిక్షణనిప్పించారు. ఈ నెల 14 వరకు హెచ్‌ఎంలు యూడైస్‌లో నమోదు పూర్తిచేయాలి. అనంతరం మండల స్థాయిలో పరిశీలన జరుగనున్నది. యూడైస్ ప్లస్‌లో పాఠశాలలు, విద్యార్థులు, ఉపాధ్యాయుల వివరాలు పకడ్బందీగా నమోదు చేయడంతో ఒకే దగ్గర అన్ని పాఠశాలల వివరాలు ఉంటాయి. సులభంగా నిధులు విడుదలయ్యే అవకాశం ఉంటుంది.



మెదక్‌లోని ప్రభుత్వ పాఠశాల

## చెరువులో పడి యువకుడు మృతి


రాజు (ఫైల్)

నిజాంపేట, డిసెంబర్10: చెరువులో పడి యువకుడు మృతి చెందిన ఘటన నిజాంపేటలో ఆదివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కుమ్మరి రాజు (30) ఈ నెల 7న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. రాజు ఆచూకీ కోసం కుటుంబసభ్యులు, బంధువులు ఎంత వెతికినా కనబడకపోవడంతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆదివారం ఉదయం స్థానిక గడీం చెరువులో రాజు మృతదేహం లభ్యమైంది. మృతుడి తండ్రి బుచ్చయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామాయంపేటలోని ప్రభుత్వ దవాఖానకు తరలించారు.

# బడిబయటి పిల్లల సర్వేకు సన్నద్ధం

- జనవరి 10 వరకు క్షేత్రస్థాయిలో సర్వే
- మార్గదర్శకాలు జారీ చేసిన విద్యాశాఖ
- వివరాలు ప్రబంధ్ పోర్టల్‌లో అప్‌లోడ్

మెదక్ మున్సిపాలిటీ, డిసెంబర్ 10: బడి బయట పిల్లలను గుర్తించి పాఠశాలల్లో చేర్పించి, వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసేందుకు విద్యాశాఖ శ్రీకారం చుట్టింది. ఈనెల 11 నుంచి వచ్చే సంవత్సరం జనవరి 10 వరకు బడిబయట పిల్లలను గుర్తించేందుకు ప్రత్యేక సర్వే చేపట్టనున్నారు. బడి బయటి పిల్లలను గుర్తించిన వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేయనున్నారు. ఇందుకోసం ప్రబంధ్ పోర్టల్‌ను ప్రత్యేకంగా రూపొందించారు. ప్రతి కాంప్లెక్స్ పాఠశాల పరిధిలో క్లస్టర్ రిసోర్స్ పర్సన్లకు ఈ బాధ్యతలు అప్పగించనున్నారు. మెదక్ జిల్లాలో 899 పాఠశాలలు ఉండగా సుమారు 90 వేల మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. బడిబయట పిల్లలను గుర్తించి వారి వయస్సును బట్టి ఆయా స్థాయి పాఠశాలల్లో చేర్పించేందుకు చర్యలు తీసుకోనున్నారు. గతేడాది నిర్వహించిన సర్వేలో 123 మంది పిల్లలను గుర్తించి ఆయా గ్రామాల్లోని పాఠశాలల్లో చేర్పించారు. సీఆర్పీలు ఈనెల 11 నుంచి తమతమ పరిధిలోని గ్రామాల్లో బడిబయట పిల్లలను గుర్తించే పనిని ప్రారంభించనున్నారు. జనవరి 10 వరకు కార్యక్రమం కొనసాగనున్నది. సర్వేలో 6 నుంచి 14, 15 నుంచి 19 ఏండ్ల పిల్లలను గుర్తించి విద్యాశాఖ ఆధ్వర్యంలో రూపొందించిన ప్రబంధ్ పోర్టల్‌లో రోజువారి వివరాలు నమోదు చేయనున్నారు. రోజూ క్లస్టర్ పరిధిలో ఎంత మంది పిల్లలను గుర్తించారనే విషయాన్ని నమోదు చేయాల్సి ఉంటుంది.

### మూడు స్థాయిల్లో గుర్తింపు..

బడి బయటి పిల్లలను గుర్తించేందుకు జిల్లావ్యాప్తంగా 64 కాంప్లెక్స్‌లకు సంబంధించిన 68 మంది సీఆర్పీలు సర్వే చేపట్టనున్నారు. సీఆర్పీలు సేకరించిన సమగ్ర సమాచారం మొదటి స్థాయిలో ఆయా కాంప్లెక్స్ పరిధిలో ప్రధానోపాధ్యాయుడు, రెండో స్థాయిలో మండల విద్యాధికారి,మూడో స్థాయిలో జిల్లా విద్యాశాఖధికారి పర్యవేక్షణలో జరుగనున్నది. చేపట్టిన సర్వేలో బడిబయటి పిల్లల గుర్తింపు పారదర్శకంగా జరిగేలా అధికారులు చర్యలు తీసుకోనున్నారు.

### క్షేత్రస్థాయిలో సర్వే..



బడి బయట పిల్లలను గుర్తించేందుకు నెల రోజుల పాటు సర్వే నిర్వహించనున్నాం. బడీడు పిల్లలను గుర్తించి బడుల్లో చేర్పించడం, డ్రాప్ అవుట్‌లను గుర్తించి బడుల్లో చేర్పించేలా చర్యలు తీసుకుంటాం. జిల్లాలో బడి బయటి పిల్లలను పూర్తిస్థాయిలో చేర్పించడమే లక్ష్యంగా ముందుకెళ్తాం. – రాధాకిషన్, డీఈవో, మెదక్

## ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

నిజాంపేట, డిసెంబర్ 10: మండలంలోని బచ్చురాజ్‌పల్లి గ్రామానికి చెందిన కమ్మరి నర్సింహులు (50) కొంత కాలంగా మద్యానికి బానిసై ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాడు. ఈ క్రమంలోనే ఆదివారం ఇంట్లోనే ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

## సజావుగా నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ పరీక్ష

మెదక్ మున్సిపాలిటీ/నర్సాపూర్, డిసెంబర్ 10: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షను ఆదివారం జిల్లాలో సజావుగా నిర్వహించినట్లు డీఈవో రాధాకిషన్ తెలిపారు. జిల్లా కేంద్రం మెదక్‌లోని 3 పరీక్ష కేంద్రాలు, తూప్రాన్, నర్సాపూర్‌లో ఒక్కో కేంద్రంలో పరీక్ష నిర్వహించినట్లు పేర్కొన్నారు. 5 పరీక్ష కేంద్రాల్లో 847 మంది విద్యార్థులకు 826 మంది (97.52శాతం) హాజరైనట్లు తెలిపారు.

## ముదిరాజ్ బేడల ఎన్నికలు ఏకగ్రీవం

రామాయంపేట, డిసెంబర్ 10: రామాయంపేటలోని ముదిరాజ్ బేడల ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. ఆదివారం దుర్గమ్మ బస్తీలో ముదిరాజ్ సంఘం బేడల సమావేశం ఏర్పాటు చేసి కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. దుర్గమ్మ బేడ అధ్యక్షుడిగా భూమ రమేశ్, దేవుని బేడ అధ్యక్షుడిగా దేవుని నర్సింహులును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో భూమ మల్లేశం, రొయ్యల పోచయ్య, రాములు, దుర్గేశ్ తదితరులు పాల్గొన్నారు.


రామాయంపేటలో ముదిరాజ్ బేడల సమావేశం


మెదక్ చర్చిలో నిర్వహిస్తున్న ప్రార్థనల్లో పాల్గొన్న భక్తులు

## చర్చిలో భక్తుల ప్రార్థనలు

మెదక్ మున్సిపాలిటీ, డిసెంబర్ 10: మెదక్ చర్చి భక్తులతో ఆదివారం కిటకిటలాడింది. రాష్ట్ర నలుమూలల నుంచి వందలాది మంది భక్తులు, పర్యాటకులు తరలిరావడంతో చర్చి ప్రాంగణమంతా నిండిపోయింది. ప్రత్యేక ప్రార్థనల్లో భక్తులు పాల్గొని తమ మొక్కులు చెల్లించుకున్నారు. చర్చి ప్రేసిబేటరి ఇన్‌చార్జి రెవరెండ్ శాంతయ్య భక్తులనుద్దేశించి దైవ సందేశం వినిపించారు. ప్రార్థనల్లో పాస్టర్లు డేవిడ్, జైపాల్, సువర్ణ చర్చి కమిటీ సభ్యులు గంట సంపత్, జాన్సన్, శాంశాన్ సందీప్, సువన్‌డగ్లస్ తదితరులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో అయ్యప్ప మహాపడిపూజ


రామాయంపేటలో యజ్ఞహోమాలు నిర్వహిస్తున్న స్వాములు


చిన్నశంకరంపేటలో 18వ మహాపడిపూజ

రామాయంపేట, డిసెంబర్ 10: రామాయంపేటలోని అయ్యప్ప ఆలయంలో మహా పడిపూజను ఆదివారం ఘనంగా నిర్వహించారు. చింత రాజు చేసిన పడిపూజకు మున్సిపల్ చైర్మన్ పల్లె జితేందర్‌గౌడ్ హాజరయ్యారు. ఆలయ సన్నిధిలో 18మెట్లకు దీపాలు వెలిగించి పూజలు చేశారు. పూజల్లో గురుస్వాములు పల్లె జితేందర్‌గౌడ్, మర్కు నగేశ్, బొద్దుల స్వామి, సాగర్, మద్దెల సాయితో పాటు కన్నె స్వాములు పాల్గొన్నారు.

**చిన్నశంకరంపేటలో..**

చిన్నశంకరంపేట, డిసెంబర్ 10: చిన్నశంకరంపేటలోని శ్రీనివాస్ గార్డెన్‌లో ఆదివారం గురుస్వామి కొల్కూరి వెంకట్‌రాంరెడ్డి ఆధ్వర్యంలో 18 మహాపడిపూజ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. చిన్నశంకరంపేటతోపాటు చేగుంట, రామాయంపేట, వెల్దుర్తి, మెదక్ మండలాల నుంచి అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు. పూజలో జడ్పీటీసీ పట్లోరి మాధవి, రైతుబంధు మండల అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, బీఆర్ఎస్ మండలశాఖ అధ్యక్షుడు రాజు సర్పంచ్‌లు శ్రీనివాస్‌రెడ్డి, దయానంద్‌యాదవ్, ఎంపీటీసీ యాదగిరి సింగిల్‌విండో చైర్మన్‌లు అంజిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు శ్రీమాన్‌రెడ్డి, కుమార్‌గౌడ్, రవీందర్‌రెడ్డి, సాన బాలకిషన్ సాన సత్యనారాయణ, సింగిల్‌విండో మాజీ చైర్మన్ సత్యనారాయణరెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సింగిల్‌విండో చైర్మన్‌లు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

**బహిరంగ ప్రకటన**

సాధారణ ప్రజలకు ఇందుమూలంగా తెలియజేయునది ఏమనగా నా క్లయింట్లు, 1) శ్రీమతి ఎం. శ్రీలేఖ భర్త ఎం. శంకర్, వయసు 39 సంవత్సరాలు, నివాసం: ప్లాట్ నం. 41, రోడ్ నం.4, మైత్రీవన్ కాలనీ, ఓల్డ్ బోయిన్‌పల్లి, సికింద్రాబాద్-11 మరియు ఇతరులు మెదక్ జిల్లా, శివంపేట్ మండలం, దొంతి గ్రామం వద్దగల సర్వే నం. 414/A/1లోని ఎ. 0.3350 గుంటలు, సర్వే నం. 414/A/2లోని ఎ. 0.3375 గుంటలు మరియు సర్వే నం. 414/A/3లోని ఎ.0.3375 గుంటలు, మొత్తం విస్తీర్ణం ఎ. 2-21గుంటల వ్యవసాయ భూమికి (షెడ్యూల్ ఆస్తిగా రిఫర్ చేయబడును) సంబంధించి అమ్మకందార్లు 1) శ్రీమతి కమ్మరి విజయలక్ష్మి భర్త కె. కృష్ణ చారి, 2) శ్రీ కమ్మరి కిషోర్ తండ్రి కె. విశ్వనాథం, 3) శ్రీ కమ్మరి రాజు తండ్రి విశ్వనాథం, 4) శ్రీమతి కమ్మరి వినోద భర్త సత్యనారాయణ & 5) టి. భార్గవి భర్త తంగపల్లి భీష్మ చారి అందరి నివాసం: ఇం.నం. 3-72, దొంతి గ్రామం, శివంపేట మండలం, మెదక్ జిల్లా వారి నుండి షెడ్యూల్ ఆస్తిని కొనుగోలు చేయుటకు ఒప్పందం కుదుర్చుకున్నారు మరియు పాక్షిక అమ్మక ప్రతిఫలం నిమిత్తం తగినంత మొత్తాన్ని కూడా చెల్లించారు. మరియు సదరు భూములు వారి పూర్వీకుల నుండి వారసత్వంగా పొందారు మరియు రెవెన్యూ రికార్డులలో మ్యుటేషన్ చేయించారు. వారి పూర్వీకులు స్వాధీనత కలిగిన తేదీ నుండి నేటి వరకు నిరంతరాయంగా సదరు షెడ్యూల్ ఆస్తి భౌతిక స్వాధీనతలో ఉన్నది మరియు అనుభవిస్తున్నారు. సదరు షెడ్యూల్ ఆస్తిపై ఏదైనా ఆసక్తి, హక్కు, టైటిల్, క్లెయిమ్ లేదా అభ్యంతరం కలిగిన ఎవరైనా ప్రచురణ తేదీ నుండి 7 రోజులలోగా అన్ని డాక్యుమెంటరీ ఎవిడెన్స్/ రుజువుతో దిగువ సంతకందారును సంప్రదించవలసిందిగా తదుపరిగా తెలియజేయడమైనది. లేనిచో పైన తెలిపిన కాలం తరువాత ఎట్టి క్లెయిమ్ లేదా అభ్యంతరం పరిశీలించబడదు మరియు నా క్లయింట్ తదుపరి పర్యవసానాల కొరకు ఏవిధంగాను బాధ్యులుకారు.
తేది: 11-12-2023

**సం/- నాసరయ్య గొల్ల**, అడ్వకేట్
ఇం.నం. 8-3-324, C-403, కృష్ణ అపార్ట్‌మెంట్, ఎల్లారెడ్డిగూడ రోడ్, అమీర్‌పేట్, హైదరాబాద్-500073.
సెల్: 9989409995, 9391038984